మార్చి నాటికి టిడ్కో గృహాల అప్పగింత

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- అధికారులతో కలసి నిర్మాణాల పరిశీలన



టిడ్కో గృహ నిర్మాణాల ప్రగతిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, చిత్రంలో కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న

కాకినాడ: పర్లోపేటలో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను మార్చి నాటికి లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కార్పొరేషన్, విద్యుత్, హౌసింగ్ అధికారులతో కలసి టిడ్కో గృహ నిర్మాణాలను పరిశీలించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కమిషనర్ కె.రమేష్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, పలువురు అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఎమ్మెల్యే ద్వారంపూడి సమీక్షించారు. అక్కడ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పనులు మరింత వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనుల ప్రగతిపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడ్కో మొదటి దశలో 1,152 ఇళ్లను మార్చి మొదటి వారానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మరో రెండు నెలల వ్యవధిలో ఫేజ్–2 ఇళ్లను కూడా పూర్తి చేస్తామన్నారు. తొలి విడత టిడ్కో లబ్ధిదారులు ఏప్రిల్ మొదటి వారానికల్లా గృహ ప్రవేశాలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే ద్వారంపూడి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యకుమారి, టిడ్కో ఈఈ రీటా, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, నాయకులు మట్టపర్తి రఘురామ్, ఎరుపల్లి సీతారామ్, మోసా పేతూరు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ములపేటలో పర్యటన

కాకినాడ దుమ్ములపేట రైల్వే ట్రాక్ వద్ద ఉన్న కేఎస్‌పీఎల్– కోరమండల్‌కు సంబంధించిన పైపులైన్‌ను ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి పరిశీలించారు. గతంలో ఉండే పరిస్థితులకు అనుగుణంగా అప్పట్లో వేసిన పైపులైన్లతో వర్షపునీరు వెళ్లేదారి లేక పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ నేపథ్యంలో అక్కడ పైపులైన్లు తొలగించి కల్వర్టులు నిర్మించాలని కేఎస్‌పీఎల్ సంస్థను కోరామన్నారు. ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన కేఎస్‌పీఎల్ అవసరమైన అనుమతులు తీసుకుని కల్వర్టులు నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే సాంబమూర్తినగర్, రేచర్లపేట, పల్లంరాజునగర్ ప్రాంతాలకు ముంపు సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. కేఎస్‌పీఎల్ సీఓఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: స్థానిక సిద్ధార్థనగర్ ఎన్‌సీసీ క్యాంటీన్ రోడ్డు 250 ఎంఎంహెచ్‌డీపీఈ పైప్‌లైన్ లీకులకు మంగళవారం మరమ్మతులు చేయనున్నారు. దీని నిమిత్తం సాయంత్రం భాస్కర్‌నగర్, శ్రీవిద్యాకాలనీ రెండు రిజర్వాయర్లలో నీటి సప్లై నిలుపుదల చేయనున్నట్లు నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి తెలిపారు. భాస్కర్‌నగర్, శ్రీవిద్యాకాలనీ, వెంకట్‌నగర్, శాంతినగర్, కొత్త కాకినాడ, నూకాలమ్మ మాన్యం, గొడారిగుంట, జయేంద్రనగర్, సిద్ధార్థనగర్, శాంతనపురికాలనీ, జయప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో (వార్డులు 3, 4, 6, 7, 8, 9) ఉన్న ప్రజలు ముందస్తు నీటిని నిల్వ చేసుకోవాలన్నారు. మంచినీరు అత్యవసరమైతే నీటి సరఫరా ట్యాంకర్లు ద్వారా సరఫరా చేసేందుకు ఈ నంబర్లో 63013 87834, 96767 70461 సంప్రదించాలని అన్నారు.

ఘనంగా మధ్వనవమి వేడుకలు

బోట్‌క్లబ్: కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రామారావుపేటలో జగద్గురు మధ్వాచార్యుల బదరికాశ్రమ ప్రవేశం సందర్భంగా మధ్వనవమి వేడుకలు నిర్వహించారు. తొలుత మధ్వసభ కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామి, కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో మధ్వాచార్యుల విగ్రహానికి పరశురామాచార్యులు అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి రామారావుపేట ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామి వారికి కోపెల్ల జానకి ప్రత్యేక హారతులిచ్చారు. అధ్యక్షులు రాఘవేంద్రస్వామి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు సత్యజ్ఞాన తీర్థుల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తారని, సభ్యులంతా పాల్గొనాలని కోరారు.

బాలల పరిరక్షణపై అవగాహన

కాకినాడ సిటీ: బాలల పరిరక్షణ విభాగం, జీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో సోమవారం బాలల పరిరక్షణపై ప్రయాణికులు, యువకులకు అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, రైల్వే సీఐ వై.కొండయ్య, ఏఎస్ఐ జి.నాగభూషణం, అధికారులు బి.రామకోటి, పి.లక్ష్మి, ఎం.సుధాకర్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

కరప: గ్యాస్ పైపులైన్ వెళ్లే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ నున్న సుజాత, వీరబాబు పేర్కొన్నారు. సిరిపురంలో సోమవారం గెయిల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసిన గొర్రెల రాము, కృష్ణ సోదరుల బుర్రకథ కళాజాతాను వారు ప్రారంభించి మాట్లాడారు. సహజ వాయువు పైపులైన్ల గురించి, వాటి రక్షణ కోసం ఏర్పాటు చేసిన వాల్వులు, యంత్రాలు, హెచ్చరిక బోర్డులు, చిహ్నాలను సూచించే స్తంభాల గురించి వివరించారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలియజేస్తూ మహాభారతంలోని ఉత్తర కల్యాణం కథను బుర్రకథ రూపంలో ఆసక్తికరంగా ప్రదర్శించారు. పరిశుభ్రత, పారిశుధ్య పనులపై కూడా గొర్రెల రాము బుర్రకథ దళం వివరించారు.

ఉత్తమ ఆపద మిత్రలకు అవార్డుల ప్రదానం



సామర్లకోట శిక్షణ కేంద్రంలో బెస్ట్ ఆపదమిత్ర అవార్డు తీసుకుంటున్న నరసింహమూర్తి

కరప: సామర్లకోటలో ఇచ్చిన శిక్షణలో కరప మండలానికి చెందిన ముగ్గురు ఆపద మిత్రలకు ఉత్తమ అవార్డులు దక్కాయి. వేళంగికి చెందిన సీహెచ్ నరసింహమూర్తి, పెద్దాపురప్పాడుకు చెందిన కె.వెంకటరమణ, పాతర్లగడ్డకు చెందిన జ్యోతికుమార్‌లకు ఈ అవార్డులు వచ్చాయని నరసింహమూర్తి తెలిపారు. ఈ అవార్డును సామర్లకోట శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, పీడీ కిరణ్మయి, శ్రీనివాస్‌ల చేతుల మీదుగా అందుకున్నామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ గ్రామాల నుంచి 116 మంది ఆపద మిత్రలను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వగా ఎనిమిది మందిని బెస్ట్ ఆపద మిత్రలుగా ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారన్నారు.

'పబ్బినీడి' మృతికి సంతాపం



పబ్బినీడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వంగా గీత, తదితరులు

కరప: గురజనాపల్లి మాజీ సర్పంచ్, పెనుగుదురు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పబ్బినీడి సత్యనారాయణ మృతికి ఎంపీ వంగా గీత, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. గురజనాపల్లి వెళ్లి పబ్బినీడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకుడు పబ్బినీడి పాపారావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, పిల్లి అనంతలక్ష్మి, ప్రముఖ వైద్యులు కర్నాసుల విష్ణుమూర్తి, పంతం మోహనకృష్ణ, పంతం నానాజీ, జ్యోతుల వెంకటేశ్వరరావు, జ్యోతుల రాజు, పిల్లి సత్యనారాయణమూర్తి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

స్థల పరిశీలన



తిమ్మాపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ రూరల్: తిమ్మాపురంలో పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన 28 సెంట్ల స్థలాన్ని జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు సోమవారం పరిశీలించారు. అక్కడి షిరిడీ సాయిబాబా ఆలయం వెనుక ఉన్న ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని పరిశీలించి భవన నిర్మాణం గురించి పోలీస్ హౌసింగ్ బోర్డు ఏఈ షేక్ వలితో చర్చించి పలు సూచనలు చేశారు. ఎస్పీ డీఎస్పీ ఎ.అంబికాప్రసాద్, కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై నాగార్జున రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నిరసన

కాకినాడ సిటీ: జీవో నంబర్ ఒకటిని రద్దు చేయాలంటూ అఖిలపక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలిపారు. ఈ జీవోను వెనక్కి తీసుకోవాలన్నారు. నాయకులు హసన్ షరీఫ్, దుర్గారమేష్, జల్లూరు వెంకటేశ్వర్లు, కె.రాజశేఖర్, తోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారం

కరప: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత గత టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. సిరిపురంలో సోమవారం ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షేమ పథకాలతో అండాదండ

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వేములవాడలో గడప గడపకూ..



వేములవాడలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండాదండగా నిలుస్తున్నాయని రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలసి కరప మండలం వేములవాడలో సోమవారం సాయంత్రం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఎమ్మెల్యే కన్నబాబు గ్రామంలోకి రాగానే సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్, మాజీ ఎంపీపీ కమిడి సీతామహాలక్ష్మి, బండే తాతాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు అప్పనపల్లి పెద్ద, పాలిక వీర్రాజు, బండే వీరబాబు, వజ్రపు కామేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామి, దుర్గాదేవి, రామాలయాల్లో పూజలు చేసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని కన్నబాబు అన్నారు. మాజీ సీఎం చంద్రబాబులా కాకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోరిక మేరకు కాలనీలో డ్రైన్లు నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, నాయకులు అడబాల ప్రసాద్, సాదే లోహిదాస్‌కుమార్, నున్న వీరబాబు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలన

గడప గడపలో కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి



పథకాలను వివరిస్తున్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, పార్టీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న

కాకినాడ: నవరత్న పథకాలతో పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. కాకినాడ 7వ డివిజన్‌లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని బర్మాకాలనీ, రాజీవ్ గృహకల్ప నుంచి ప్రారంభించారు. కౌడా చైర్‌పర్సన్‌చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, పలువురు అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కౌడా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథాన పయనిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ప్రజల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వద్ద పనిచేసే అవకాశం దక్కడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డీఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి తొంపల తాతారావు, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ సిగల మధు, నాయకులు బత్తినరాజు, నందకుమార్, దొర్ల సుశీల తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయ సాధనకు కృషి



కరప ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ మహాత్మునికి నివాళి



రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో గాంధీకి నివాళులర్పిస్తున్న డీఎల్‌డీఓ తదితరులు

కరప: గాంధీ మహాత్ముని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు, కార్యదర్శులు, పాఠశాలల్లో హెచ్‌ఎంలు గాంధీజీకి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, సర్పంచులు సాదే ఆశాజ్యోతి, చింతా నాగలక్ష్మి, కొత్త నాగలక్ష్మి, అడబాల సత్య, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు.

కాకినారు రూరల్: సత్యం, అహింస ప్రధాన ఆయుధాలుగా గాంధీ ప్రచారం చేశారని విశ్రాంత పోలీసు ఉద్యోగి బుద్ధరాజు సత్యనారాయణరాజు అన్నారు. రమణయ్యపేటలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. మహాత్ముడి చిత్రపటానికి సత్యనారాయణ రాజు, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేశారు. రూరల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి కాకినాడ డివిజనల్ అభివృద్ధి అధికారి పి.నారాయణమూర్తి, ఈఓపీఆర్ అండ్‌ఆర్‌డీ బాలాజీ, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకినాడ సిటీ: స్థానిక జీజీహెచ్ అవుట్‌గేట్ వద్ద గాంధీ చిత్రపటానికి జీజీహెచ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీజీహెచ్‌లో 2021 సెప్టెంబర్‌లో 65 మందిని, 2022 జూన్‌లో 89 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అక్రమంగా విధులకు దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. పలివెల వీరబాబు, రమణ, శ్రీనివాస్, చక్రవర్తి, వరకుమార్, బేబీరాణి పాల్గొన్నారు.

కాకినాడ క్రైం: కాకినాడలోని టీబీ కంట్రోల్ సెంటర్‌కు కలెక్టర్ కృతికా శుక్ల హాజరై డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతిప్రభతో కలసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిలు మహాత్ముడికి నివాళి అర్పించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



గొర్రిపూడి హైస్కూల్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అధికారులు, నాయకులు

కరప: ప్రభుత్వం సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, కూరాడ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం జగనన్న విద్యా భారతి పేరిట ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను టెన్త్ విద్యార్థులకు వారు పంపిణీ చేశారు. ఆయా హైస్కూళ్లలో 347 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు చీకాల సుబ్బారావు, చీకాల అప్పలరాజు, బొండా చంటిబాబు, సవిలే రాజేష్, వాసంశెట్టి కొండ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం



సమస్యలు వింటున్న కమిషనర్ రమేష్, ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: 'స్పందన'లో వచ్చిన ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపుతామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఇతర అధికారులతో కలసి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికపరమైన, కోర్టు వివాదాలున్న అంశాలు మినహా మిగిలిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి తదితర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఆదేశాలు ఇస్తున్నామన్నారు. ప్రజలు సమీపంలోని సచివాలయాల్లో అర్జీలు అందజేయవచ్చన్నారు.

ప్రభుత్వ పథకాలపై సర్వే



పథకాల గురించి వివరిస్తున్న అదనపు కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను తెలియజేసేందుకు రెండు రోజుల పాటు సిటిజన్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. సోమవారం ఆయన దుమ్ములపేటలోని 10ఏ సచివాలయం పరిధిలో జరిగిన సిటిజన్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఏదైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని మహిళలు పొందుతున్న వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కాపునేస్తం, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వీటిపై సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు నగరంలోని వంద సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహించి సిటిజన్ ఔట్‌రీచ్ మొబైల్ యాప్‌లో నమోదు చేస్తామన్నారు. నగరంలో దాదాపు లక్షా 30 వేల ఇళ్లను సందర్శించి ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఆయా డివిజన్లకు చెందిన ప్రత్యేకాధికారులు, నోడల్ ఆఫీసర్లు, సచివాలయ ఉద్యోగులు సర్వే ప్రక్రియ చేస్తారన్నారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సంబంధిత సచివాలయ అడ్మిన్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

భూములు అప్పగించాలని వినతి

కాకినాడ సిటీ: ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్ భూములను రెవెన్యూ అధికారులు భూస్వాములైన కొందరికి పాస్ పుస్తకాలు ఇచ్చి పేదలకు అన్యాయం చేశారని, మా పేరుతో ఉన్న అసైన్డ్ భూములను తిరిగి అప్పగించాలంటూ కరపకు చెందిన బాధితులు కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం ఫిర్యాదు చేశారు. తమ స్వాధీనంలో ఉన్న భూములను స్థానిక వీఆర్వో ప్రభుత్వ జగనన్న గృహాల నిమిత్తం తీసుకుందని, ఆ భూములకు డబ్బులు ఇస్తారని, తమతో సంతకం పెట్టించుకుని మోసం చేశారని బాధితులు బుడిత లక్ష్మి, కుంచే కామరాజు వివరించారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను ఆదరించాలి



కుష్ఠు వ్యాధిగ్రస్తులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: కుష్ఠు వ్యాధిగ్రస్తులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవాన్ని స్థానిక విముక్తి లెప్రసీ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు లెప్రసీ కాలనీల్లో వారికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు స్పర్శ కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధి వికలాంగులకు విశ్రాంత డీఎంహెచ్‌వో దుప్పట్లు, ఫిజియోథెరపిస్ట్ చీరలు, పండ్లు అందజేశారు. కాలనీలో అందరికీ ప్రముఖ పారిశ్రామికవేత్త బుచ్చిరాజు డ్రెస్సింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతిప్రభ, డాక్టర్ మణికుమార్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ముందుగా గాంధీ చిత్రపటానికి కలెక్టర్ కృతికా శుక్లా, వైద్యాధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిమ్నాస్టిక్ క్రీడాకారిణికి అభినందన



జిమ్నాస్టిక్ క్రీడాకారిణి యాసిన్‌ను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: మహారాష్ట్ర దొంబివలి ఈస్ట్‌నావి ముంబయిలో శరవన్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకూ జరిగిన జిమ్నాస్టిక్స్ సీనియర్ నేషనల్ ట్రాంపోలైన్ అండ్ తంబ్లింగ్ పోటీల్లో ఎస్.యాసిన్ బంగారు పతకం సాధించింది. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమెను కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ, జిల్లా జిమ్నాస్టిక్స్ క్రీడా శిక్షకులు ఎస్.సురేష్ వద్ద ఆమె శిక్షణ తీసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడంతో పలువురు క్రీడా ప్రముఖులు ప్రశంసించారు. యాసిన్‌ను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు డీఎస్ సునీత, బి.శ్రీనివాసకుమార్, జిల్లా క్రీడా శిక్షకులు ఎస్.సురేష్ తదితరులు అభినందించారు.

ముగిసిన బేస్‌బాల్ పోటీలు



రెండో స్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పు జట్టు

నాగమల్లితోట జంక్షన్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్ జిల్లాల బేస్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. అండర్–17 బాలుర విభాగంలో గుంటూరు, శ్రీకాకుళం, ప్రకాశం, బాలికల విభాగంలో కడప, ప్రకాశం, శ్రీకాకుళం, అండర్–14 బాలుర విభాగంలో విజయనగరం, తూర్పు, కడప, బాలికల విభాగంలో విజయనగరం, చిత్తూరు, కర్నూలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు కాకినాడ డివిజన్ డీవైఈఓ ఆర్‌జేడీ రాజు బహుమతులు అందజేశారు. పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, పరిశీలకులు అన్నపూర్ణ, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు జార్జి, పీడీ రంగారావు, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొనారు.

అలరించిన సంగీత కచేరీ

కాకినాడ కల్చరల్: సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళా మందిర్‌లో 75వ సంక్రాంతి వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు సంగీత విద్వాంసుడు విజయగోపాల్ వేణుగాన సంగీత కచేరీ శ్రోతలను అలరించింది. సభ అధ్యక్షుడు నారాయణం మురళి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఎం.నాగేశ్వరరావు, ఆర్‌ఏ రావు, భారతలక్ష్మి, ఎస్‌కేవీడీ వెంకట్రావు, మణిబాబు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సదస్సు విజయవంతానికి పిలుపు

కాకినాడ సిటీ: ట్రాన్స్‌పోర్టు రంగ సమస్యలపై ఫిబ్రవరి 7న కాకినాడలో జిల్లా సదస్సు జరుగనుంది. దీనిని జయప్రదం చేయాలని కోరుతూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రచార యాత్రను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ సోమవారం ప్రారంభించారు. ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరిగితే డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. మోటారు వాహన సవరణ చట్టం 2020 రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జరుగుతుందని శేషుబాబ్జీ వివరించారు. కార్యక్రమంలో పలివెల వీరబాబు, నామా రాంబాబు, సీహెచ్ రాజ్‌కుమార్, మలక వెంకటరమణ, సీహెచ్ పద్మ, నర్ల ఈశ్వరి, మేడిశెట్టి వెంకటరమణ, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫారంపై వృద్ధుడి మృతదేహం



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

కాకినాడ క్రైం: స్థానిక పోర్టు రైల్వే స్టేషన్‌లోని మూడో నంబరు ప్లాట్‌ఫారంపై సోమవారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం (65) లభ్యమైందని జీఆర్‌పీ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. సుమారు 5.3 అడుగుల ఎత్తు ఉన్న సదరు వ్యక్తి నేవీ బ్లూ రంగు ప్యాంటు, పచ్చ చొక్కాతో పాటు గ్రే కలర్ చలికోటు ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 02328 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.